- కళ తప్పిన ఉద్యానవనాలు
- మూలకు చేరిన క్రీడా పరికరాలు
- వరుణ్ బీచ్, లక్ష్మీ టాకీస్ పార్కుల్లో దుస్థితి



లక్ష్మీటాకీస్ పార్కులో ఊయల



వరుణ్‌బీచ్ పార్కులో ఊయల ఇలా..

ఆహ్లాదం.. ఆవిరి

దాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ హయాంలో ఆహ్లాదానికి మారుపేరుగా కళకళలాడే ఉద్యానవనాలు నేడు అసౌకర్యాల నెలవుగా మారాయి. కళ తప్పి దీనంగా దర్శనమిస్తున్నాయి. చిన్నారుల క్రీడా పరికరాలు తుప్పు పట్టి, విరిగిపోయి మూలకు చేరాయి. దాదాపు రెండు లక్షల జనాభా ఉన్న దక్షిణ నియోజకవర్గంలో చెప్పుకోవడానికి పార్కులున్నా, అవి నిరుపయోగంగా, అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారాయి.

కళావిహీనంగా లక్ష్మీటాకీస్ పార్క్

లక్ష్మీటాకీస్ పార్క్ అసౌకర్యాలకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. పిల్లలు ఇష్టపడే జారుడు బల్ల, తోపుడు బల్ల, ఊయల తుప్పు పట్టి విరిగిపోయాయి. పచ్చగా ఉండాల్సిన పార్క్‌లో రాళ్లు, మట్టి, బొగ్గు కనిపిస్తోంది. ఇక రాత్రివేళల్లో మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. పార్కులో ఆహ్లాదం మచ్చుకైనా కనిపించడం లేదు.



వరుణ్ బీచ్ పార్కులో జారుడు బల్ల దిగువ భాగంలో రంధ్రం

వెలవెలబోతున్న వరుణ్‌బీచ్ పార్క్

సాగరతీరంలోని వరుణ్ బీచ్ పార్కులో పిల్లలు ఆడుకునే క్రీడాపరికరాలు ఆర్నెల్ల క్రితం వరకు చక్కగా ఉండేవి. నిత్యం ఎంతోమంది పిల్లలు సాయంత్రం వేళల్లో, వారాంతాల్లో సందడి చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పార్కుల అభివృద్ధి, నిర్వహణ అంతంతమాత్రంగానే ఉన్నాయి. క్రీడా పరికరాలు పాడైనా, నిర్వహణ సరిగ్గా లేకపోయినా పట్టించుకునే నాథుడు లేక ఒక్కొక్కటిగా మూలకు చేరుతున్నాయి. పార్కులోని జారుడు బల్ల, ఊయల విరిగిపోయాయి. రంగుల రాట్నం కనీసం కనిపించడం లేదు. ఉన్న ఒకే ఒక్క జారుడుబల్ల మెట్లు తుప్పపట్టి విరిగిపోగా, పై నుంచి జారే చోట పెద్ద రంధ్రం ఏర్పడింది. అందులో కాళ్లు పడి, పలువురు చిన్నారులు ప్రమాదాలకు గురయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించి పార్కుల నిర్వహణను పట్టించుకోవాలని సందర్శకులు కోరుతున్నారు.



రాళ్లు తేలిన లక్ష్మీటాకీస్ పార్క్

మర్యాదపూర్వక కలయిక

మహారాణిపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆ పార్టీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన్ను కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.



మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డితో జాన్‌వెస్లీ

మత్స్యకార భరోసా రూ.20 వేలకు పెంచాలి

- కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చాలి
- ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు అల్లిపల్లి ఎల్లాజీ

దాబాగార్డెన్స్ : మత్స్యకార భరోసాను రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లిపల్లి ఎల్లాజీ డిమాండ్ చేశారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 20, 21న బీచ్‌రోడ్డు సీపెరల్ హోటల్ ప్రాంగణంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం సంఘ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. ఏటా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 20న ఉదయం 10 గంటల నుంచి ఆంధ్రా కవాలీ పోటీ నిర్వహించనున్నట్లు చెప్పారు. 21న ఉదయం మహిళల మురళీ కోలాటం, రేలారే.. రేలా, చిన్నపిల్లల సాము గరిడీ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మధ్యాహ్నం మత్స్యకారులకు భోజనాలు, మహిళలు, వృద్ధులకు చీరలు, రగ్గులు, దుప్పట్లు అందజేయనున్నట్లు చెప్పారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, భీమునిపట్నం ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, జీవీఎంసీ స్థాయి సంఘం మాజీ సభ్యుడు చింతపల్లి పోతురాజు (పులి) పాల్గొంటారని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న అల్లిపల్లి ఎల్లాజీ

మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎల్లాజీ డిమాండ్ చేశారు. మత్స్యకార భరోసాను రూ.20 వేలకు పెంచుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ప్రస్తుతం రూ.9 ఉన్న డీజిల్ సబ్సిడీని రూ.20కి పెంచాలని, తుఫానుల సమయంలో ప్రమాదవశాత్తు చనిపోయిన మత్స్యకారులకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేసియా అందజేయాలని, ఫిషింగ్ హార్బర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి దొంగతనాలు, రౌడీయిజాన్ని అరికట్టాలని కోరారు. మినీ జెట్టీలు ఏర్పాటు చేయాలని, తీరంలోని కెమికల్ ఫ్యాక్టరీలు తనిఖీ చేసి తగు చర్యలు చేపట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా సీఆర్‌జెడ్ లోపల నిర్మించిన బీచ్ రిసార్ట్స్, బార్ అండ్ రెస్టారెంట్లు తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శివ, నారాయణ, పేర్ల భూలోకరావు, గనగళ్ల ఎర్రయ్య, గరికిన నూకరాజు, రాగతి సత్యారావు, బొడ్డు తాతారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా కుంకుమ పూజలు



విశేష అలంకరణలో గౌరీ పరమేశ్వరులు

అల్లిపురం : వేంకటేశ్వరమెట్టపై శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారికి మంగళవారం కుంకుమ పూజలు వేడుకగా నిర్వహించారు. అర్చకులు పర్యవేక్షణలో మహిళలు అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో వేంకటేశ్వర మెట్ట, కంఠంవారి వీధి, బంగారుమెట్ట తదితర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

కేజీహెచ్ ఏవోకు అభినందనలు



ఏవో అప్పారావుకు అభినందనలు తెలుపుతున్న నాయకులు

దాబాగార్డెన్స్ : కేజీహెచ్ పరిపాలన అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పీఎస్ అప్పారావును ఆస్పత్రి ఎస్సీ, ఎస్టీ యూనియన్, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడు నీలాపు శ్రీనివాస్ నేతృత్వంలో పలువురు ఉద్యోగులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్ఎన్ఓ, ఎమ్ఎన్ఓలకు యూనిఫాం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఏవో స్పందిస్తూ త్వరలోనే యూనిఫామ్స్ అందజేస్తామని తెలిపినట్టు శ్రీనివాస్ చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు వెంకటరావు, పార్వతి, ఎస్కే బేగం, సిరుపల్లి రాజారావు, కాంతం, కె.లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

అల్లిపురం : మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఉక్కు మహిళ అని జీవీఎంసీ మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ముందుగా ఇందిరాగాంధీ విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలను వివరించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, మహిళా చట్టాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అల్లిపురం శాఖ గ్రంథాలయం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు మాట్లాడుతూ బుధవారం విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

మానవ హక్కుల రక్షణకు కృషి

దాబాగార్డెన్స్: ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్ అసోసియేషన్ ఆలిండియాకు మెయిన్ ఆర్గనైజర్‌గా నేషనల్ బోర్డు కమిటీ ఆఫ్ ఇండియా సిఫార్సుపై తనను నియమించినట్టు సన్ని కృష్ణ రాజయ్య బయగాని (ఆల్ఫా కృష్ణ) తెలిపారు. ఈ మేరకు మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్ అసోసియేషన్ నేషనల్ బోర్డు కమిటీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ కామేష్ గాడి తనను జాతీయ స్థాయిలో మెయిన్ ఆర్గనైజర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఈ పదవి మూడేళ్లపాటు ఉంటుందని, ప్రజలకు ఆర్టీఐ చట్టం, మానవ హక్కులను రక్షించడం, హ్యూమన్ రైట్స్, యాక్టివిస్ట్ అసోసియేషన్ తరపున సంబంధిత సామాజిక కార్యకలాపాలు కొనసాగిస్తానని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆల్ఫా కృష్ణ

ఇందిరాగాంధీకి ఘన నివాళి

సీతమ్మధార : ఇందిరా గాంధీకి విద్యార్థులు ఘన నివాళులర్పించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ద్వారకానగర్ దరి నెహ్రూబజార్ వద్ద గల ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో మంగళవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ముందుగా ఇందిరాగాంధీ చిత్రపటానికి లైబ్రేరియన్ బి.ఎ.పద్మావతీదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మంచి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. దేశ నాయకుల జీవితచరిత్రలు చదివి, వారి ఆశయసాధనకు కృషి చేయాలని కోరారు. గ్రంథపాలకుడు కె.పైడిరాజు, రికార్డ్ అసిస్టెంట్ శంకరరావు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తెలుగు సాహిత్య చరిత్రలో ఎందరో మహనీయులు

సీతంపేట : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం 'శతజయంతి సాహితీమూర్తులు' ప్రసంగలహరి నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన అరసం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ ఒక ఏడాది అటుఇటుగా వందేళ్ల క్రితం జన్మించిన మహనీయులు కాళీపట్నం రామారావు గొప్ప కథకులుగా, అవంత్స సోమసుందర్, దాశరథి గొప్ప కవులుగా, తెలంగాణ పోరాట యోధులుగా, ఆరుద్ర గొప్ప రచయితగా, అలూరి బైరాగి విలక్షణమైన కవిత్వం రాశారని గుర్తు చేశారు. ఒక్కొక్కరూ మహావృక్షాలై వందేళ్ల తర్వాత కూడా మనం మాట్లాడుకునేంత గొప్పగా తెలుగు సాహిత్య చరిత్రలో నిలిచిపోరాయని కొనియాడారు. అరసం కార్యదర్శి క్షేత్రపాల్‌రెడ్డి మాట్లాడుతూ కారా కథల్లో వాస్తవిక సన్నివేశాలను వివరించారు. ప్రముఖ విశ్లేషకులు డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ వజ్రాయుధ కవి అవంత్స సోమసుందర్ కవితా దృక్పథాన్ని వివరించారు. దాశరథి చలన చిత్ర గీతాలను రాంభట్ల నృశింహశర్మ ఆలపించి, అందులోని సాహిత్య విలువలను విశ్లేషించారు. ఆరుద్రత్వమేవాహం కావ్యం గురించి డాక్టర్ ఎం.సుబ్బారావు, ఆలూరి బైరాగి సాహిత్య సమాలోచన గురించి ఆచార్య వెలమల సిమ్మన్న ప్రసంగించారు. కార్యక్రమంలో అరసం ఉపాధ్యక్షుడు ఎస్.హనుమంతరావు, పి.ఎ.రాజు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు

కార్మికులకు న్యాయం చేయాలి

సీతంపేట : ఎంజీఎం సెవెన్ హిల్స్ ఆస్పత్రి యాజమాన్యం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఎం అక్కయ్యపాలెం జోన్ నాయకుడు వై.రాజు డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి ఆస్పత్రిలో పనిచేస్తున్న 38 మంది కార్మికులను అక్రమంగా తొలగించడానికి యాజమాన్యం పూనుకోవడం అన్యాయమన్నారు. కార్మికులను తొలగిస్తున్నట్టు నోటీసులు జారీ చేశారని, ఇది కార్మిక చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. యాజమాన్య వైఖరిని నిరసిస్తూ మంగళవారం బాధితులతో కలిసి అక్కయ్యపాలెంలోని లేబర్ ఆఫీసు ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా జీతాలు సక్రమంగా చెల్లించడం లేదని, యాజమాన్యం కోరినట్టు కాగితాలు రాసి ఇవ్వలేదని జీతాలు ఆపేశారన్నారు. 38 మందికి ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు జరిగిన అన్యాయంపై జాయింట్ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు చొరవ తీసుకుని సమస్యలు పరిష్కరించి, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.



ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

ఎన్‌ఎంసీహెచ్‌లో ఆధార్ శిబిరం

సీతమ్మధార : విద్యార్థుల ఆధార్ నమోదు సమయంలో దొర్లిన చిన్నచిన్న తప్పులను సీతమ్మధార దరి పీఅండ్‌టీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల (ఎన్‌ఎంసీహెచ్)లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో సవరిస్తున్నారు. ఆధార్ కార్డులో తప్పులు, అక్షర దోషాల సవరణకు తగిన ఆధారాలు అందజేస్తే సవరిస్తామని నిర్వాహకులు తెలిపారు. సచివాలయంలో జారీ చేసిన పుట్టిన తేదీ, ఇతర ధృవపత్రాల ఆధారంగా తప్పులు సరిదిద్దుతున్నారు. ఈ ప్రత్యేక శిబిరం బుధవారం కూడా కొనసాగుతుందని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు మాత్రమే ఆధార్‌కార్డులో సవరణలకు అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీతమ్మధార ఎంఈవో డి.రామారావు శిబిరాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ధీరవనిత ఝాన్సీ రాణి



ఝాన్సీ లక్ష్మీభాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంస్థ సభ్యులు, విద్యార్థులు

దాబాగార్డెన్స్: ధీరవనిత ఝాన్సీ లక్ష్మీభాయి అని స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు అన్నారు. లక్ష్మీబాయ్ జయంతిని పురస్కరించుకుని స్వామి వివేకానంద సంస్థలో ఆమె చిత్ర పటం వద్ద సంస్థ సభ్యులు, విద్యార్థులు నివాళులర్పించారు. సంస్థ సీనియర్ సభ్యుడు డి.లక్ష్మణరావు మాట్లాడుతూ 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటులో ఆమె ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడారని పేర్కొన్నారు. విద్యార్థులు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, ట్యూషన్ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ఎన్‌సీసీ దినోత్సవం



కళాశాల ఆవరణలో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ క్యాడెట్లు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ కె.గీతాంజలి, అధ్యాపకులు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

నిరాశ్రయుడికి వైద్య సేవలు

విశాఖ విద్య: జగదాంబ సెంటర్‌లోని బస్ షెల్టర్ వద్ద నిస్సహాయ స్థితిలో ఉన్న వ్యక్తిని మమత చారిటబుల్ ట్రస్టీ ఎల్లేటి మమత ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. నిస్సహాయ స్థితిలో ఓ వ్యక్తి ఉన్నాడని స్థానికుల సమాచారంతో మమత చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఎల్లేటి మమత వెంటనే స్పందించి మహారాణి పేట సీఐ సహకారంతో ఆ వ్యక్తిని ట్రస్ట్ వాహనంలో చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేర్పించారు.

కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా ప్రభుత్వ విధానాలు

దాబాగార్డెన్స్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న దేశవ్యాప్తంగా తలపెట్టిన ప్రదర్శనలో కార్మిక వర్గం, రైతాంగం పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి లోకనాథం పిలుపునిచ్చారు. నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు దూకుడుగా అమలు చేస్తోందన్నారు. మన రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ విధానాలకు మద్దతు తెలియజేయడం వల్ల కార్మికులకు, రైతాంగానికి నష్టం జరుగుతోందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామన్న టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులను అక్రమంగా తొలగిస్తూ పర్మినెంట్ కార్మికులను వీఆర్ఎస్ పేరిట బయటకు నెట్టేస్తోందన్నారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకపోతే సెయిల్‌లో విలీనం చేయాలన్న ప్రజల డిమాండ్‌ను మోదీ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ప్లాంట్ భూములను అదానీకి కట్టబెట్టే చర్యలు ఆపాలన్నారు. కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్ రద్దు చేసి, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించి, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. 26న నగరంలోని డీఆర్ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఎం.జగ్గునాయుడు, డాక్టర్ బి.గంగారావు, బొట్టా ఈశ్వరమ్మ, కేఎం శ్రీనివాస్, బి.జగన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 17 కేజీల గంజాయిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం పోలీసులు ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్ఐ ఎస్కే అబ్దుల్ మారూఫ్, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ పి.శివనారాయణ సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, మధుర జిల్లాకు చెందిన దేవేంద్ర 17 కేజీల గంజాయి విశాఖపట్నం మీదుగా ఆగ్రా తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. గంజాయి స్వాధీనం చేసుకుని, విచారణ నిమిత్తం జీఆర్పీ సిబ్బందికి నిందితుడిని అప్పగించారు. అనంతరం రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

మరో పది కేజీలు స్వాధీనం

అదేవిధంగా రైల్వే స్టేషన్‌లోని మరో ప్రాంతంలో జీఆర్పీ ఎస్ఐ కె.శాంతారాం, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎం.ఎల్.మీనా సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి 10 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలలో ఆర్పీఎఫ్ సిబ్బంది ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దీపాన్సు పరిహార్, గౌతం సింగ్ పరిహార్ నుంచి 10 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరు విశాఖపట్నం మీదుగా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌కు అక్రమంగా తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు నిర్ధారించి అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం జీఆర్పీ సిబ్బందికి నిందితులను అప్పగించారు. అనంతరం రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ కె.శాంతారాం తెలిపారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ ఎంట్రప్రెన్యూర్ డేని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జోర డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీఈవో సాగర్ కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డ్రోన్స్ రంగంలో ఎంట్రప్రెన్యూర్‌గా ఎదగడం, విజయం సాధించడం అనే అంశంపై ఆయన ప్రసంగించారు. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్ష కలిగిన వారికి స్ఫూర్తిని అందించే విధంగా ఈ ప్రసంగం సాగింది. డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి వాల్యూమెట్రిక్ ఎనాలసిస్ చేసే విధానాన్ని ఆయన తెలియజేశారు. ప్రణాళిక, డేటా సంపాదించడం, డేటా ప్రాసెస్ చేయడం, ప్రాజెక్ట్ పూర్తి చేయడం అనే దశలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా తాను నిర్వహించిన పలు ప్రాజెక్టులను విద్యార్థులతో పంచుకున్నారు. అదే విధంగా ఆ హబ్ అందిస్తున్న ప్రోత్సాహం, ఇటీవల సాధించిన విజయాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.పద్మశ్రీ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య బి.ప్రజ్ఞ, ఈసీఈ విభాగాధిపతి ఎస్.అరుణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగర్ కోటేశ్వరరావును కళాశాల తరపున సత్కరించారు. డ్రోన్ వ్యవస్థకు సాగర్ అందిస్తున్న సేవలు, కృషిని ప్రిన్సిపాల్ అభినందించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాష్ కార్యక్రమంపై డీఆర్‌డీఏలో సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి

ఎంవీపీకాలనీ: జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బి.లక్ష్మీపతి ఆధ్వర్యంలో వాష్ (వాటర్, శానిటేషన్, హైజీన్) కార్యక్రమంపై జిల్లా ఏపీఎంలకు, డీపీఎంలు, సీసీలతో సమీక్ష నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో యూనిసెఫ్, సెర్ప్ అధికారుల సమన్వయంతో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్యం, రక్షిత మంచినీరు సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ, వ్యక్తిగత అలవాట్లలో మార్పులు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించడంతోపాటు శిక్షణ అందించారు. మండల స్థాయిలో అవగాహన కల్పించాలని పీడీ లక్ష్మీపతి ఈ సందర్భంగా తెలిపారు.